క్లుప్తంగా

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నందిగామ: మండల పరిధిలోని చేగూరు, మేకగూడ పీఏసీఎస్‌లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మండల వ్యవసాయాధికారి వాణిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రాన్ని రైతాంగం సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని వారు విజ్ఞప్తి చేశారు.

సంజీవ మరణం తీరని లోటు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చేతాళ్ల సంజీవ(54) మరణం తీరని లోటని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధి జాపాల గ్రామంలో అనారోగ్యంతో సంజీవ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన.. సంజీవ పార్థివదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సంజీవ నిత్యం ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసేవాడని, ఎవరికి ఏ కష్టం వచ్చినా.. ముందుండేవాడని గుర్తుచేశారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు విష్ణు వర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, జంగయ్య తదితరులు ఉన్నారు.

నిస్వార్థ సేవకుడు

నిస్వార్థ ప్రజాసేవకుడు సంజీవ. అలాంటి మంచి మిత్రున్ని కోల్పోయామని సంగారెడ్డి అడిషనల్ ఎస్పీ సంజీవరావు అన్నారు. అనంతరం సంజీవ పార్థివదేహానికి నివాళి అర్పించారు. ఆయన వెంట తెలంగాణ విశ్వ విద్యాలయాల నాన్‌టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఎన్. జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, భిక్షపతి ఉన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి స్వాగతం

ఆమనగల్లు: లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల నాయకులు ఆదివారం నగరంలోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బాబా, సింగిల్ విండో డైరెక్టర్ జగన్, రమేష్ గౌడ్, విజయ్ రాథోడ్, శివ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రం చేయాలి

తలకొండపల్లి: మండలానికి కావాల్సిన అన్ని వనరులు గట్టుఇప్పలపల్లికి ఉన్నాయని, అయినా ఎందుకు గుర్తించడం లేదని జేఏసీ చైర్మన్ మొక్కురాల అశోక్ గౌడ్ అన్నారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని చేపట్టిన దీక్ష ఆదివారానికి పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. మండలం ఏర్పాటు చేయాలని సుదీర్ఘ కాలంగా పోరాడుతున్నా.. ప్రభుత్వాలు స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తించి, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ అయినా మండలం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, రామాంజనేయులు, రాములు, నరసింహ, జంగయ్య, బాల్యా నాయక్, రామచంద్రయ్య, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండాలి

కందుకూరు: ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేయాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పిట్టల పాండుముదిరాజ్, గౌరవ అధ్యక్షుడు కాకి రాములు, అడ్వైజరీ కమిటీ సభ్యులు కాకి దశరథ, గొర్రెంకల యాదయ్య సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవనంలో ఆ సంఘం పూర్తిస్థాయి మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముదిరాజ్‌లు పోటీతత్వం అలవర్చుకొని ఒకరికొకరూ సహకరించుకుంటూ ముందుకుసాగాలని సూచించారు. అనంతరం ఎన్నుకున్న కమిటీని ప్రకటించారు. కాగా ముదిరాజ్ సంఘం మండల ప్రధాన కార్యదర్శులుగా ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, కొర్వి సురేందర్‌ముదిరాజ్, యూత్ అధ్యక్షుడిగా కాకి మధుసూదన్‌ముదిరాజ్, మత్స్యశాఖ అధ్యక్షుడిగా పూలగాజుల లింగం, సోషల్ మీడియా అధ్యక్షుడిగా సన్నిళ్ల సత్యనారాయణ, కోశాధికారిగా సన్నిళ్ల వెంకటేశ్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా నల్లి సుదర్శన్, అంబటి యాదగిరి, సన్నిళ్ల నరేందర్, రొట్టెల కృష్ణ, సీహెచ్ రవీందర్, పిట్టల యాదయ్య, ఢిల్లీ యాదయ్య, ఈసరి శ్రీనివాస్, అనెమోని హరికృష్ణ, కార్యదర్శులుగా నీలం యాదగిరి, గద్దగూటి శ్రీను, సుద్దాల నర్సింహ, శ్రీను, రమేశ్, నీలం పెద్ద వెంకటేశ్, పంగాల యాదయ్య, ఉప కోశాధికారిగా ఎడ్ల మహేందర్, యూత్ జనరల్ సెక్రటరీగా మామిళ్ల ప్రవీణ్, యూత్ ఉపాధ్యక్షులుగా నీలం వెంకటేశ్, నరేందర్, బాలకృష్ణ, మేరు రాజు, యూత్ కార్యదర్శులుగా నర్సింహ, నర్సింహ, మదన్‌మోహన్, భాస్కర్, రాఘవేందర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అడ్వైజరీ కమిటీ సభ్యులు శ్రీశైలం, సుదర్శన్, ఢిల్లీ గణేశ్, ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతుకు భరోసా ఏదీ?

యాసంగి సాగుకు సమాయత్తం

- పెట్టుబడి సాయం ఊసెత్తని సర్కారు
- ఆందోళనలో అన్నదాతలు



షాబాద్: వానాకాలం సీజన్ ముగిసింది. యాసంగి వచ్చింది. అయినా ప్రభుత్వం రైతు భరోసాపై స్పష్టత ఇవ్వడం లేదు. కనీసం ఈ సీజన్‌లోనూ పెట్టుబడి సాయం అందుతుందా... అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మండలంలో సుమారు 58 వేల ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా ప్రతి సంవత్సరం 35 వేల నుంచి 40 వేల పైచిలుకు ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. కాగా గత ప్రభుత్వం 2018 వానాకాలం నుంచి 2023 యాసంగి వరకు వరుసగా 12 సార్లు పెట్టుబడి సాయం అందించింది. సీజన్ ఆరంభానికి ముందే రైతుబంధు ఇవ్వడంతో సకాలంలో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకొని పంటలు సాగు చేశారు. 2018 వానాకాలంలో పథకాన్ని ప్రారంభించి 2018 వరకు ఎకరాకు రూ.4వేల చొప్పున, ఏడాదికి రూ.8 వేల పెట్టుబడి సాయం అందించారు. అయితే 2019 వానాకాం సీజన్ నుంచి ఎకరాకు రూ.వేల చొప్పున ఏడాదికి ఎకరాకు రూ. 10వేలు అందించారు. 2023 యాసంగి వరకు గత ప్రభుత్వం మండలానికి రూ. 2కోట్ల రూపాయల వరకు రైతుబంధు రైపంలో రైతులకు అందజేసింది. చివరగా 2023 యాసంగిలోనూ మండలానికి 26 వేల మంది రైతులకు 45 వేల ఎకరాల భూమికి రూ 1.50 కోట్ల పెట్టుబడి సాయం ఇచ్చింది.

స్పష్టత కరువు..

గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి రాగానే రైతు భరోసా ఎకరాకు రూ.7,500 చొప్పున, ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పారు. కాగా అధికారంలోకి వచ్చి సుమారు 11 నెలలు కావొస్తున్నా పెట్టుబడి సాయంపై స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికే వానాకాలం సీజన్ గడిచిపోయింది. యాసంగి సీజన్ రానే వచ్చింది. వ్యవసాయశాఖ అధికారులు సాగు అంచనా సైతం ఖరారు చేశారు. కానీ పెట్టుబడి సాయానికి సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వానాకాలం సీజన్‌లో ఎలాగు ఇవ్వలేదు. కనీసం ఈ యాసంగికైనా పెట్టుబడి సాయం అందుతుందా అంటూ రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గందరగోళంలో రుణమాఫీ..

మండలంలో రుణమాఫీ గందరగోళంగా మారింది. ఏ ప్రాతిపదికన రుణమాఫీ ఇచ్చారో అర్థంకానీ పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ అన్నారు. కానీ లేనిపోని సాకులు చూపుతూ అనేక మంది రైతులకు మాఫీ చేయలేదు. తెల్లరేషన్ కార్డు లేనివారికి అధికారులు కుటుంబ నిర్ధారణ చేశారు. కానీ ఇప్పటికీ వారి ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేయలేదు. అలాగే కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు సైతం మాఫీ చేసినా ప్రభుత్వం మరికొంత మందికి చేయలేదు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగి తల్లిదండ్రులకు సైతం రుణమాఫీ కాలేదు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే తమకు ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. బ్యాంకర్ల నుంచి ప్రభుత్వం నేరుగా డేటా తీసుకుందని అంటున్నారు. అలాగే రైతుభరోసా సైతం ఏ ప్రాతిపదికన ఇస్తారనేది ఇప్పటి వరకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

రైతుభరోసా అందజేయాలి



ప్రభుత్వం రైతులను ఆర్థిక సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతులకు రైతు భరోసా అందజేయాలి. గత ప్రభుత్వంలో ప్రతీ సంవత్సరం రెండుసార్లు రూ.10వేలు అందజేసింది. ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. ఇప్పటి వరకు ఇవ్వలేదు. దీంతో రైతులు పంటల సాగు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

– మహేందర్‌రెడ్డి, రైతు పోలారం, షాబాద్

దేవాలయ నిర్మాణానికి విరాళం

షాబాద్: దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని మల్లన్న దేవాలయ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, దోనూరు గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ పురాతన మల్లన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న దేవాలయానికి తనవంతు ఆర్థిక సహాయంగా నందిగామ మండలం బండోనిగూడ గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బండ అశోక్ రూ.9లక్షల రూపాయల విరాళంను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. పురాతన దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో ఇంత పెద్దగా దేవాలయాలు నిర్మించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు శంకరయ్య, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి బండ అశోక్

దేవాలయాలకు రక్షణ కల్పించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న స్వాములు, గ్రామస్తులు

కేశంపేట: రాష్ట్రంలో దేవాలయాలకు రక్షణ కల్పించాలని కోరుతూ మండల కేంద్రంలో ఆదివారం అయ్యప్ప స్వాములు, గ్రామస్తులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. శంషాబాద్ మండలంలోని జూకల్ గ్రామంలో గ్రామ దేవతల ఆలయంపై దాడికి పాల్పడిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు తిరుమలయ్యగౌడ్, అమరేశ్‌యాదవ్, పాండుగౌడ్, పవన్‌కుమార్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, గ్రామస్తులు రమణయ్యగౌడ్, శేఖర్, సతీశ్, అనసూయ, శంకర్, యాదయ్య, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవమైనది



ఎంఈఓ కిష్టారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు ఎంఈఓగా పనిచేస్తూ శంషాబాద్ బదిలీపై వెళ్లిన కిష్టారెడ్డికి కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల పీఆర్టీయూ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో గురువులకు ఒక ప్రత్యేక గౌరవమున్నదని, ఒక విద్యార్థి ఎంతో గొప్ప స్థానంలో ఉన్న తనకు విద్య నేర్పిన గురువుకు ప్రత్యేక గౌరవం ఇస్తాడని గుర్తుచేశారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలతో పాటు షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ, కొత్తూర్ మండలాలకు సైతం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ ప్రభుత్వ పాఠశాలలను ఒక చక్కని దిశగా నడిపించిన నైపుణ్యం గల వ్యక్తి కిష్టారెడ్డి అన్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా విద్యార్థులకు మంచి సేవలందించి, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొందుర్గు ఎంపీఓ గాయత్రి, జిల్లేడ్ కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు నాజర్‌అలీ, వంశీధర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేశ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, గోపీనాథ్, సునిత, చెన్నారెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతి కులాలపై వివక్ష తగదు

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వానికి సంచార జాతి కులాలపై వివక్ష తగదని సంచార జాతుల సంఘం నాయకుడు బైలు కమ్మర మోహన్‌చవాన్ అన్నారు. ఆదివారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ఫారంలోని 45వ ప్రశ్నను(సంచార జాతి కులం) ఎందుకు తొలగించారని ఆయన ప్రశ్నించారు. సంచార జాతి అనే చులకన భావంతోనే తొలగించారని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని అధికారులకు సంచార జాతి ప్రజలేవరో తెలియదు. ఇప్పటికైనా ఎవరో అని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

మైసమ్మ పండుగను ఘనంగా నిర్వహించాలి



గ్రామస్తులకు వివరాలు వెల్లడిస్తున్న ఒడుపులమ్మ తల్లి

నందిగామ: గ్రామంలో పురాతనమైన దేవాలయం ఉన్న చోటనే నూతనంగా మైసమ్మ ఆలయం మూడునెలల్లో నిర్మించాలని, అనంతరం మూడు ఏళ్లలోపు పండుగను ఘనంగా నిర్వహించాలని ఒడుపులమ్మ తల్లి వెల్లడించారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో పలు ఆలయాలతో పాటు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒడుపులమ్మ తల్లి హాజరై పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామం అన్ని రకాలుగా చల్లగా ఉండాలంటే గ్రామ నడిబొడ్డులో గతంలో మైసమ్మ ఆలయం ఉన్న చోటనే మూడు నెలల్లోగా నూతనంగా ఆలయాన్ని నిర్మించాలని చెప్పారు. అనంతరం మూడు ఏళ్లలోపు గ్రామంలో మైసమ్మ పండుగను నిర్వహించాలని సూచించారు. అంతకుముందు గ్రామస్తులు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తూర్‌తో పాటు మహేశ్వరం మండలంలోని సిరిగిరిపురం, తుక్కుగూడ పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బీఎల్ఓలతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనవరి 1వ తేదీ 2025 వరకు 18 ఏళ్లు పూర్తయ్యే వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. తమ పరిధిలో ఉన్న బీఎల్ఓలకు దరఖాస్తులు అందజేయాలన్నారు. ఓటరులో ఏమైనా తప్పులు సరిచేయడానికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గోపాల్ ఉన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



మత్స్యకారులకు చేపపిల్లలను అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మండల కేంద్రంలోని పాపిరెడ్డిగూడ, కేశంపేట, తొమ్మిదిరేకుల, లింగంధన, కొత్తపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట, ఇప్పలపల్లి, అల్వాల, సంతాపూర్, బైర్కాన్‌పల్లి, చింతకుంటపల్లి, నిర్దవెల్లి గ్రామాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మత్స్యకారులకు చేపపిల్లలను పంపిణీ చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి ఎటువంటి ప్రోత్సాహకాలను అందించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి చేపపిల్లలు పంపిణీ చేయడంతో పాటు ఆధునిక పద్ధతిలో చేపల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో మత్స్యకారులకు 4లక్షల 70వేల చేపపిల్లలను అందించినట్లు అధికారులు తెలిపారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు

మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో గల కార్యసిద్ధి రామాంజనేయస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్, భాస్కర్‌గౌడ్, సురేశ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గిరియాదవ్, యాదయ్యయాదవ్, రుప్లానాయక్, శ్రీనాథ్, అఖిల్, అమీర్ పాల్గొన్నారు.

దళారులకు నమ్మి మోసపోవొద్దు

పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: వరి ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవొద్దని ఎంపీపటేల్‌గూడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధి పోచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల మేలు కోరి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే.. మద్దతు ధరతో పాటు బోనస్ వస్తుందని, సకాలంలో బ్యాంకు ఖాతాలో డబ్బులు పడతాయన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు బాల్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీశైలం, యాదమ్మ, వ్యవ సాయ శాఖ అధికారి విద్యాధరి, ఏఈఓ శ్రవణ్‌కుమార్, పీఏసీఎస్ సీఈఓ విజయలక్ష్మి, నాయకులు రాంరెడ్డి, శేఖర్‌రెడ్డి ఉన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి తదితరులు

సాగర్‌రోడ్డుపై గ్రామస్తుల ధర్నా

చరణ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్



ధర్నా చేస్తున్న కొత్తపల్లి గ్రామస్తులు

యాచారం: నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారిపై తక్కళ్లపల్లి గేట్ వద్ద ఆదివారం కొత్తపల్లి గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ రోడ్డుపై తమ్మలోనిగూడ గేట్ వద్ద శనివారం కారు ఢీకొన్న ఘటనలో కొత్తపల్లికి చెందిన చరణ్ అనే విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విద్యార్థి మృతికి కారణమైన వ్యక్తిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ ధర్నా చేశారు. సదరు వ్యక్తిపై తగిన చర్యలు తీసుకొని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన విరమించాలని గ్రామస్తులను పోలీసులు కోరినా.. ససేమిరా అనడంతో కొద్దిసేపు ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సీఐ నర్సింహారావు ఘటనాస్థలికి చేరుకొని, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

కాలుష్య నివారణకు చర్యలు

ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాలుష్య నివారణకు చర్యలు చేపడతామని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని మైహోమ్స్ కాలనీ, అంతఃపురం కాలనీల్లో చైర్మన్ నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదగిరిలు పర్యటించారు. ఈ సందర్భంగా మైహోమ్స్ కాలనీలో అసోసియేషన్ సభ్యులు వీరిరువురికి కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, పరిశ్రమల వలన వచ్చే కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలుష్య కారకులకు నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. వాతవరణ కాలుష్యానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలకు వెనకడుగువేసేది లేదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మర్రి అర్చన తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే



షాబాద్: అంతారంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అపర్ణ

- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు
- సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీఓలు

షాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సంపూర్ణంగా సహకరించాలని ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కక్కులూర్, అంతారం, సర్దార్‌నగర్, కుర్వగూడ గ్రామాల్లో పర్యటించి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే జరుగుతుందని చెప్పారు. సర్వేలో భాగంగా ఒక్కొక్క ఇంటి వద్ద వివరాల సేకరణకు అరగంటకుపైగా సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు ఉన్నారు.



చేవెళ్ల: కమ్మెటలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

చేవెళ్ల: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తుండాలని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. మండలంలో చేపడుతున్న కులగణన సర్వేను ఆదివారం కమ్మెట గ్రామంలో ఆయన పరిశీలించారు. ఎన్యుమరేటర్లు, అధికారులతో మాట్లాడి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారులకు సంప్రదించాలన్నారు.